# విద్యార్థిని మృతికి కారణమైన వారిని వెంటనే శిక్షించాలి



**కారేపల్లి, కెరటం న్యూస్**

ఖమ్మం నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్న ఇంద్రపల్లి హరిణి (18) మృతికి కారణమైన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా మహిళా సంఘం మండల కార్యదర్శి కొండబోయిన ఉమావతి డిమాండ్ చేశారు. శుక్రవారం కారేపల్లిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ. ఖమ్మంలో నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ చదువుతు సెలవుల నిమిత్తం హరిణి తన స్వగ్రామమైన జూలూరుపాడు మండలం వెంకటాపురం గ్రామానికి వెళ్లిందన్నారు. ఆమె తల్లి కూలి పనికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి బాత్రూం వెనుక భాగంలో హరిణి నిర్జీవంగా శవశీగ పడి ఉండటాన్ని గుర్తించారని తెలిపారు.హరిణి ఒంటిపై గాయాలు, రక్తపు మరకలు, దుస్తులుచిరిగిపోయి ఉండ టంతో ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తమవు తున్నాయని, ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. హరిణి మృతికి గల కారణాలను సమగ్రంగా దర్యాప్తు చేసి, హంతకులను గుర్తించి తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఉమావతి డిమాండ్ చేశారు. దేశంలో బాలికలు, మహిళలపై హత్యలు, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, ప్రేమ పేరుతో మైనర్ బాలికలను మోసం చేయడం వంటి ఘటనలు రోజు రోజు కు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దిశ, నిర్భయ, పోక్సో వంటి చట్టాలు ఉన్నప్పటికీ మహిళలు, బాలికలపై అఘాయిత్యాలను పూర్తిగా అరికట్టడంలో అధికార యంత్రాంగం, పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థిక ప్రలోభాలకు, రాజకీయ ఒత్తిళ్లకుతలొగ్గకుండా పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి, బాధ్యులనుచట్టపరంగా కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవా లని ఐద్వా మండల కార్యదర్శి కొండబోయిన ఉమావతి డిమాండ్ చేశారు.

# ఐలమ్మ ధైర్యసాహసాలు ఎప్పటికీ ఆదర్శమే

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**



వీరనారి చాకలి ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా శుక్రవారం ఆమెకు నివాళులర్పిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో ప్రజల హక్కుల కోసం సాగిన పోరాటంలో ఐలమ్మ పోషించిన పాత్ర మరువలేనిదని గుర్తుచేశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె ప్రదర్శించిన తెగువ, పౌరుషం తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని చాటిందని నామ వెల్లడించారు. అన్యాయాన్ని ఎదిరిస్తూ హక్కుల కోసం ఐలమ్మ చూపిన ధైర్యం, సంకల్పం ఎంతో గొప్పవని నామ స్పష్టం చేశారు. సామాజిక అణచివేతకు ఎదురొడ్డి నిలిచిన ఆమె పోరాటం ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చిందని వివరించారు. ముఖ్యంగా మహిళలు తమ హక్కుల కోసం ధైర్యంగా ముందుకు సాగేందుకు ఐలమ్మ జీవితం స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు.

# ప్రభుత్వం దృష్టికి పంచాయతీ కార్యదర్శుల సమస్యలు



**హైదరాబాద్ బ్యూరో, కెరటం న్యూస్**

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డిరాష్ట్రంలో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసేలా కృషి చేయనున్నట్టుగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ ఫెడరేషన్(టీపీఎస్ఎఫ్) రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం హైదరాబాద్ లోని ఖైరతాబాద్ లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రాములు, గ్రామ పాలనా అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు పాల్గొన్నారు. టీపీఎస్ఎఫ్ స్టేట్ ప్రెసిడెంట్ ఏ.శ్రీకాంత్ గౌడ్, జనరల్ సెక్రటరీ చీ. నాగరాజు, ట్రెసరర్ వీ.శశిధర్, గౌరవ అధ్యక్షులు ఎం. సందీప్ ఈ సందర్భంగా లచ్చిరెడ్డి దృష్టికి పలు సమస్యలను తెచ్చారు. ఓపీఎస్ ద్వారా వచ్చిన పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా గుర్తించాలని కోరారు. ఇదే కాకుండా వాళ్ళు పని చేసిన కాలాన్ని కూడా పరిగణలోకి తీసుకొని రెగ్యులర్ చేయాలన్నారు. జూనియర్ పంచాయతి కార్యదర్సులుగా పని చేసిన నాలుగేళ్ల కాలాన్ని నోషనల్ సర్వీస్ గా గుర్తించాలని కోరారు. న్యాయబద్ధమైన ప్రతి డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయనున్నట్టుగా ఈ సందర్భంగా లచ్చిరెడ్డి తెలిపారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ, పంచాయతీరాజ్ విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అప్పుడే ప్రజలకు కావాల్సిన సేవలు అందడంతో పాటు అభివృద్ధి కూడా జరుగుతుందన్నారు.

# ఇల్లు కూల్చిన ఘటనపై ఏసీపి ధర్యాప్తు



**ఖమ్మం, కెరటం న్యూస్**

ఇటీవల రఘునాధపాలెం మండలం లోని పువ్వాడ ఉదయ్ నగర్ పంచాయతీ కేంద్రంలో రాత్రి పూట ఇల్లు కూల్చిన ఘటనపై ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి శుక్రవారం సాయంత్రం సంఘటన స్థలాన్ని సందర్శించి, దర్యాప్తు చేపట్టారు. కాగా దర్యాప్తు కన్నముందు ఒకరోజు గురువారం నాడు రంగనాథ పాలెం పోలీసులు ఈ ఉదంతంపై పలు సెక్షన్లతోపాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. నిందితులు యాకూబు, ఎలుక శివ , ఇస్మాయిల్, వీరన్న, శివ, సిద్దయ్య లతోపాటు మరికొందరిపై ఈ కేసును నమోదు చేశారు. ఇటీవల ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ ఖమ్మంలో సమావేశం నిర్వహించిన సందర్భంగా బాధితులు ఆయనను కలిసిన అనంతరం ఈ కేసు నమోదు కావటం జరిగిందని పేర్కొంటున్నారు. గత సంవత్సరం నవంబర్ లో కూడా ఇదే ఇల్లును ధ్వంసం చేశారని బాధితులు ఈ సందర్భంగా తెలిపారు. గతంలోనూ ఇటీవల కాలంలో ఇల్లు కూల్చిన ఘటన సందర్భంగా నిందితులు బాధితులను కులం పేరుతో దూషించటం కారణంగానే ఈ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయినట్లు తెలుస్తోంది.